క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. బాలసముద్రం, ప్రమోద ఆస్పత్రి, జయశంకర్ పార్కు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేటినుంచి కేయూలోకి ప్రవేశం లేదు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం దృష్ట్యా ఈ నెల 6, 7వ తేదీల్లో విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి వాకర్లు, ఇతరులకు ప్రవేశం లేదని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శనివారం ఉత్తర్వులు జారీచేశారు. స్నాతకోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్‌లోని మైనార్టీ బాలుర గురుకులంలో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమేష్‌లాల్ హట్కర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వంటమనిషి (1), ధోబీ (1), స్వీపర్ (1), ఎలక్ట్రీషియన్ (1) ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 10లోపు ఓగ్లాపూర్ సైలానీబాబా దర్గా వద్ద (ఎస్‌బీఐటీ క్యాంపస్) పనిదినాల్లో అందజేయాలని కోరారు. ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలతో పాటు నైపుణ్య సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు జతచేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99493 00368, 95739 69991 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కళాశాలలో 'క్లీన్ అండ్ గ్రీన్'

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను వలంటీర్లు తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజ్‌కుమార్, దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాల భవన నిర్మాణ పనుల పరిశీలన

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయం సమీపంలో నిర్మిస్తున్న భద్రకాళి సాంగ వేద ఆగమ సంస్కృత పాఠశాల నిర్మాణ పనులను దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, భద్రకాళి దేవాలయ ఈఓ శేషుభారతి శనివారం పరిశీలించారు. వేద పాఠశాల అధ్యాపకుడు నర్సింహమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల పనివేళలు మార్చాలి



విద్యారణ్యపురి: రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు డిమాండ్ చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గురుకులాల సమయం ఉదయం 9గంటలకు మార్చాలన్నారు. గురుకులాల్లోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు పీఎస్ఆర్.మల్లిక్, మెరుగు ప్రసన్నానంద్ పాల్గొన్నారు.

నిరుపేదలకు పట్టాలివ్వాలి

హన్మకొండ కల్చరల్: 20ఏళ్లుగా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలివ్వాలని భూపోరాట ఉద్యమ నాయకుడు ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. రంగశాయిపేట ఆర్ఆర్ గార్డెన్‌లో ఇళ్లు, ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో గణపాక ఓదెలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రత్యూష దాసు, రాజు, మైదం శేఖర్, గుడిసెవాసులు పాల్గొన్నారు.

సంగయ్య సేవలు మరువలేనివి



వరంగల్ చౌరస్తా: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ రిటైర్డ్ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి క్యారం సంగయ్య సేవలు చిరస్మరణీయమని మార్కెట్ అధికారులు, సిబ్బంది కొనియాడారు. ఈ మేరకు మార్కెట్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలాలు వేసి శనివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి, గ్రేడ్ -2 కార్యదర్శి ఈ.అంజిత్ రావు, మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, కార్యదర్శి జి.రాజేందర్, మార్కెట్ కమిటీ ఉద్యోగులు నర్సింగరావు, నర్సింహ, మురళి, గంగాధర్, సాగర్, స్వప్న, శ్రీకాంత్, సలీమ్ వినయ్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సెక్యూరిటీ గార్డులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు శిఖంలోనే చెత్త డంపింగ్



శుభ్రం చేసిన గోపాలపురం చెరువు



చెరువులో పోసిన చెత్తాచెదారం

హసన్‌పర్తి: నగరంలోని 56వ డివిజన్ గోపాలపురం చెరువు శిఖంలోనే చెత్తాచెదారాన్ని డంపింగ్ చేస్తున్నారు. చెరువులోని ముళ్ల పొదలతో పాటు అందులో కూరుకుపోయిన చెత్తాచెదారం, వ్యర్థాలను తొలగించడానికి రూ.5 లక్షలు ఖర్చు చేసి నెలక్రితం శుభ్రం చేశారు. అయితే, మున్సిపల్ సిబ్బందితో పాటు ప్రైవేట్ వ్యక్తులు వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్ల ద్వారా తీసుకొచ్చి చెరువులోనే డంపింగ్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం, వ్యర్థాలు డంపింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు మొహర్రం

● భారీగా పీర్ల ఊరేగింపు



హసన్‌పర్తి: పీరీలు

హసన్‌పర్తి: పవిత్ర మొహర్రం పర్వదినాన్ని ముస్లింలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొహర్రం మొదటి నెల ప్రకారం.. షియా తెగకు చెందిన ముస్లింలు శోకదినంగా పాటిస్తారు. కర్బలా మైదానంలో మహ్మద్ ప్రవక్త మనవళ్లు ఇమాం హుస్సేన్‌తో పాటు ఆయన అనుచరులు ధర్మరక్షణార్థం తమ ప్రాణాలు అర్పించారు. ఆ ఘటనను స్మరిస్తూ మొహర్రం జరుపుకోవడం ఆనవాయితీ. దీన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలు ఉండడం సంప్రదాయం. మొహర్రం మొదటి నెల మొదటి రోజునే ఆయా గ్రామాలు, పట్టణాల్లోని ఆషుర్‌ఖానా (మందిరం)లో పీరీలను ప్రతిష్ఠిస్తారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని పదో రోజు నిమజ్జనం చేస్తారు. ఆ రోజు సాయంత్రం ఆషుర్‌ఖానాల నుంచి పీరీలను భారీగా ఊరేగింపుగా తీసుకెళ్తారు. ఈ సందర్భంగా భక్తులు ఎదురొచ్చి మొక్కులు సమర్పించుకుంటారు. అనంతరం గ్రామాల్లోని సమీప చెరువుల్లో పీరీలను నిమజ్జనం చేస్తారు. మొహర్రం .. మత సామరస్యానికి ప్రతీకగా చెప్పుకోవచ్చు.

టేకులగూడెంలో పీరీల ఊరేగింపు

మడికొండ: టేకులగూడెం గ్రామంలో పీరీల ఊరేగింపును ముస్లింలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి నివాసానికి వెళ్లగా, పీరీలను ఆయన కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

పెట్టుబడిదారుల కోసమే లేబర్‌కోడ్‌లు



వరంగల్ చౌరస్తా: మార్కెట్‌లో కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ల నాయకులు



హన్మకొండ చౌరస్తా: కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న యూనియన్ బాధ్యులు

న్యూశాయంపేట: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర్‌కోడ్‌లను కేంద్రం తీసుకొచ్చిందని కార్మిక సంఘాల నాయకులు విమర్శించారు. హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో జాతీయ కార్మిక సంఘాల సమావేశం శనివారం జరిగింది. ఈ నెల 9న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ రాగుల రమేష్, ఏఐటీయూసీ జక్కుల రాజు, ఐఎఫ్‌టీయూ దయాకర్, టీఎన్‌టీయూసీ శ్యాంసుందర్, టి.ఉప్పలయ్య, కూర వెంకట్, వేల్పుల సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

వరంగల్ చౌరస్తా: దేశవ్యాప్తంగా ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆల్ మిల్స్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి వరంగల్ ప్రధాన కార్యదర్శి ఇనుముల శ్రీనివాస్ కోరారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సమ్మె కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజు, సతీష్ బాబు, శ్రీనివాస్, సంపత్, అనిల్, నలిగంటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

మడికొండ: ఈ నెల 9వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి పిలుపునిచ్చారు. కాజీపేట మండలం రాంపూర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సమ్మె వాల్ పోస్టర్లను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సారంగపాణి, నాయకుడు మద్దెల ఎల్లేష్ మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం తీసుకొచ్చి కార్మికులను యజమానులకు కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మునిగాల భిక్షపతి, మేకల శంకర్, వేణుకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాల విడుదల

హన్మకొండ చౌరస్తా: ఈ నెల 9వ తేదీన తలపెట్టిన సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో సమ్మె కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలకుంట యాకయ్య, బొల్లారం సంపత్, యేసు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న సీఐ

కాజీపేట రూరల్: ఓ బాలుడిని అతని తల్లిదండ్రులకు కాజీపేట జీఆర్పీ పోలీసులు శనివారం అప్పగించారు. కాజీపేట జీఆర్పీ సీఐ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ దోమలగూడకు చెందిన 13 ఏళ్ల కంచుమూర్తి ప్రీతమ్ సందీప్‌ను తల్లిదండ్రులు మందలించడంతో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి శనివారం బయటికి వచ్చాడు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు హైదరాబాద్ దోమలగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ నుంచి కాజీపేట వైపు వెళ్తున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న బాలుడిని ప్రయాణికులు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ బాలుడిని కాజీపేట జీఆర్పీ పోలీసులు చైల్డ్ లైన్‌కు తరలించారు. వివరాలు సేకరించి ఒయాసిస్ ఆర్ఫనేజ్ చైల్డ్‌హోం నుంచి బాలుడిని అతడి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వివరించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత



బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న సీఐ

కాజీపేట రూరల్: బాధితుడికి కాజీపేట జీఆర్పీ పోలీసులు శనివారం సెల్‌ఫోన్ అప్పగించారు. కాజీపేట జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ వి.నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కాజీపేట మండలం మడికొండకు చెందిన ఎ.భిక్షపతి రెండు నెలల క్రితం కాజీపేట రైల్వే స్టేషన్‌లో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించి అప్పగించినట్లు సీఐ వివరించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ రమణారెడ్డి, కానిస్టేబుళ్లు ప్రసాద్, హరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న వాసవి, వనిత క్లబ్ సభ్యులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని ప్రాథమిక మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు వాసవి, వనిత స్వచ్ఛంద సంస్థ క్లబ్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ బోధన అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం మల్లారెడ్డి, రిటైర్డ్ లెక్చరర్ పూల్యానాయక్, వనిత క్లబ్ అధ్యక్షులు వాసవి, ప్రధాన కార్యదర్శి లావణ్య, ప్రతినిధులు కిరణ్, భవాని, పాఠశాల ఉపాధ్యాయులు కోమల్ రెడ్డి, శ్రీలత, అరుణ, రమేష్‌బాబు, వేణుగోపాల్, కమల, సరిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై సానుకూల స్పందన



శామ్యూల్ దంపతులను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు

హన్మకొండ అర్బన్: ఉద్యోగుల సమస్యలపై త్వరలో ప్రభుత్వం నుంచి స్పష్టమైన సానుకూల స్పందన వస్తుందని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు. హనుమకొండ సుబేదారిలోని అసుంత భవన్‌లో భువనగిరి జిల్లా సీపీఓ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా టీజీవోస్ మాజీ అధ్యక్షుడు కొంగర శామ్యూల్‌ల ఉద్యోగ విరమణ అభినందన సభ గెజిటెడ్ అధికారుల జిల్లా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్మోహన్ రావు, టీజీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, హనుమకొండ కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వరంగల్ కార్యదర్శి ఫణి కుమార్, కోశాధికారి రాజేష్ కుమార్, ఆకవరం శ్రీనివాస్ కుమార్, కిరణ్ కుమార్, కోలా రాజేష్, రామారావు, శ్రీరామ్ రెడ్డి, శ్రీనేష్, హరికృష్ణ, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రఫీ, భూపాలపల్లి కార్యదర్శి సునీల్, జీవన్, టీఎన్ జీఓ హనుమకొండ అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బైరి సోమయ్య, వేణుగోపాల్, సదానందం, బూరుగు రవి, దశరథ్, ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు, రఘుపతి రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో పతకాలు



కిక్‌బాక్సింగ్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: జూన్ 28వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన తెలంగాణ వాకో కిక్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో తమ క్రీడాకారులు పాల్గొని పతకాలు సాధించారని హనుమకొండ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారి సంతోష్ తెలిపారు. ఆదిత్యవర్ధన్, రిష్విత్‌ప్రసాద్, గగన్, హర్ష, శ్రీమాన్, దొరబాబు, అక్షిత్, కార్తికేయ, శ్రీకాంత్, లలిత్‌కుమార్, అభినయ్, ఇస్మాయిల్, అచ్యుత, లాస్య, తేజశ్రీ, శివకీర్తన, లక్ష్మీ ప్రసన్న, త్రివేణి, సాత్విక్, కార్తికేయ, శ్రీమాన్‌లు బంగారు, వెండి పతకాలు సాధించారని వివరించారు. ఈ సందర్భంగా వారిని అసోసియేషన్ తెలంగాణ ప్రెసిడెంట్ రామాంజనేయులు, జిల్లా సెక్రటరీ తిరుపతి, అకాడమీ కోచ్‌లు దినేష్ తేజ, గణేష్ తేజ, వెంకటేష్, వైష్ణవి, శివాత్మిక అభినందించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంఘాల నేతలు

హన్మకొండ అర్బన్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని టీఎన్జీఓఎస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఉద్యోగ సంఘాల నేతలు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, బైరి సోమయ్య, పుల్లూరి వేణుగోపాల్, పనికెల రాజేష్, శ్యాంసుందర్, రామునాయక్, రాగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'జర్నలిస్టులపై పాలకుల వివక్ష'



మాట్లాడుతున్న మామిడి సోమయ్య

రామన్నపేట: జర్నలిస్టుల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని, వారి వైఖరిని జర్నలిస్టులు ప్రతిఘటించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సూచించారు. వరంగల్‌లోని కెమిస్ట్ భవన్‌లో జిల్లా తృతీయ మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా జర్నలిస్టుల జనచైతన్య యాత్ర చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం పదేళ్ల పాటు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా ద్రోహం చేసిందని, అదే బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని ఆరోపించారు. ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బండి విజయ్‌కుమార్, వల్లాల జగన్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ బస్వరాజు కుమార్, జిల్లా కార్యదర్శి బొట్ల స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి



పొలంబాటలో విజేందర్‌రెడ్డి, తదితరులు

హసన్‌పర్తి: ప్రస్తుతం వర్షాకాలంలో విద్యుత్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా డివిజన్ ఇంజనీర్ (టెక్నికల్ అండ్ సేఫ్టీ ఆఫీసర్) ఎ.విజేందర్ రెడ్డి సూచించారు. హసన్‌పర్తి మండలం గంటూరుపల్లిలో శనివారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. లూజ్ లైన్, వంగి ఉన్న స్తంభాలను సరిచేస్తున్న క్రమంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్టాటర్లు, కరెంట్ మీటర్లకు మరమ్మతులు చేస్తున్న క్రమంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీ అశోక్‌కుమార్, ఏఈ శిరీష్‌కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ హనుమంత్ నాయక్, లైన్‌మెన్ రాజమౌళి, అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీనివాస్, వాజీద్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ పేరుతో వేధింపులు వద్దు

నయీంనగర్: విచారణ పేరుతో ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావును వేధింపులకు గురిచేయవద్దని వరంగల్ జిల్లా వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నడిపెల్లి వెంకటేశ్వర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభాకర్ రావు తన సర్వీస్‌లో వివిధ ప్రభుత్వాలు, సీఎంల వద్ద నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు ఆయన పనిచేస్తారని, అలాంటి అధికారిని ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. టి.అమృతరావు, గండ్ర గోపాల్‌రావు, బి.పాపారావు, టి.రఘునాథ్ రావు, సత్యనారాయణ రావు, పాపారావు, జయశ్రీ, ప్రభాకర్ రావు, జితేందర్ రావు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కీలక పోస్టులను భర్తీ చేయాలి

వరంగల్ అర్బన్: గ్రేటర్ వరంగల్‌లో కీలకమైన ఎస్ఈ, ఈఈ, సీపీ, డీసీపీ, ఏసీపీతో పాటు ఇతర పోస్టులను భర్తీ చేయాలని చిన్నవడ్డేపల్లి చెరువు ఆక్రమణ ఏరియాల పరిరక్షణ కమిటీ సొసైటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీలక పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల అనేక అవినీతి, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పెరుమాండ్ల లక్ష్మణ్, కేడల ప్రసాద్ పాల్గొన్నారు.

స్కూల్‌కు భూ కేటాయింపును స్వాగతిస్తున్నాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు కేయూ భూమిని పాలకమండలి కేటాయిస్తూ ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఓ లేఖను రిజిస్ట్రార్ రామచంద్రంకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు జంగంపెల్లి పవన్, బోడ ఈశ్వర్, బోగి సూరజ్, ఇప్ప శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సదస్సును జయప్రదం చేయాలి

న్యూశాయంపేట: ఈ నెల 12న హనుమకొండలో జరగనున్న ప్రజానాట్య మండలి జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కొండూరి భాస్కర్ కోరారు. హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో శేడ రమేష్ అధ్యక్షతన శనివారం ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో జిలా ప్రజానాట్య మండలి కో ఆర్డినేటర్ ఎం.చుక్కయ్య, నాయకులు కదారి సుదర్శన్, వేల్పుల రవి, తదితరులు పాల్గొన్నారు.

16న కళాకారుల సంఘం రాష్ట్ర సదస్సు

కేయూ క్యాంపస్: ఈ నెల 16న హనుమకొండలోని సిటిజన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న తెలంగాణ బ్యాండ్ కళాకారుల సంఘం రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు సదస్సు పోస్టర్లను కేయూ మొదటి గేట్ వద్ద శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ గుమ్మడి నాగరాజు, మాజీ అధ్యక్షుడు రాజసాహెబ్, వృత్తి సంఘాల హనుమకొండ జిల్లా కన్వీనర్ లింగయ్య, బాధ్యులు శంకర్, అంజన్న, అప్సర్, యూసిన్‌నూర్ పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుకు సన్మానం

హన్మకొండ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును హనుమకొండకు చెందిన పార్టీ నాయకుడు చాడా శ్రీనివాస్ రెడ్డి, తదితరులు సన్మానించారు. హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వరంగల్ చౌరస్తా: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పార్టీ వరంగల్ నాయకులు హైదరాబాద్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. నాయకులు గందె నవీన్, కల్పన, ఎరుకాల రఘునారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత మధుమేహ వైద్యశిబిరం

కాజీపేట రూరల్: బాపూజీనగర్ మెయిన్‌రోడ్డులోని సిద్ధు టెంట్‌హౌజ్ వద్ద డాక్టర్ మోహన్ డయాబెటిస్ స్పెషాలిటీ సెంటర్ ఆధ్వర్యంలో మధుమేహ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డాక్టర్ రంజిత్‌రావు పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో నార్లగిరి రమేష్, గబ్బెట శ్రీనివాస్, దిడ్డి శ్రావణ్ కుమార్, ప్రమోద్, వెన్నెల, స్వాతి, గబ్బెట కరుణ్, కిషన్, పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ వేడుక

కాజీపేట రూరల్: సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో విద్యార్థుల ఇన్వెస్టిచర్ వేడుక (విద్యార్థుల నాయకత్వ స్వీకరణ) కార్యక్రమం శనివారం జరిగింది. డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ (ఎన్ఐటీ వరంగల్) శ్రీనివాసా ఆచార్య మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ నైపుణ్యాలు అలవర్చుకోవాలని సూచించారు. ఎన్నికైన విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ జోసెఫ్ అమల రాజన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పీటీ జోసెఫ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి ల్యాదెళ్ల శరత్, బాధ్యులు కోరారు. ఈ మేరకు వరంగల్ డీఈఓ మామిడాల జ్ఞానేశ్వర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు హరీష్, శివకుమార్, సోను, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా స్ఫూర్తితో సమాజ సేవ చేద్దాం

హన్మకొండ: రతన్ టాటా పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో సమాజ సేవ చేద్దామని సీనియర్ బిజినెస్ అసోసియేట్ పులి లావణ్య ముదిరాజ్ అన్నారు. టాటా బాటలో సమాజ సేవ చేద్దాం అనే కార్యక్రమాన్ని హనుమకొండ నక్కలగుట్టలోని టాటా ఏఐఏ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ బిజినెస్ అసోసియేట్‌గా ఎంపికైన పులి లావణ్యను టాటా ఏఐఏ క్లస్టర్ హెడ్ వేముల వినోద్, బ్రాంచ్ మేనేజర్ కొయ్యడ లక్ష్మణ్, ట్రైనింగ్ మేనేజర్ గందమాల ప్రవీణ్‌కుమార్ సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి దుర్మరణం

హసన్‌పర్తి: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సంఘటన కరీంనగర్ - హనుమకొండ ప్రధాన రహదారిలోని భీమారంలోని జగతి గార్డెన్ సమీపంలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం నగరంలోని కాజీపేటకు చెందిన మహ్మద్ యాకుబ్ (70) ఆర్టీసీలో ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. కుటుంబ పోషణ నిమిత్తం ప్రైవేట్ గైడ్‌గా అవతారమెత్తాడు. ఆరెపల్లి - యాదాద్రి జాతీయ రహదారి మార్గ మధ్యలోని చింతగట్టు ఓఆర్ఆర్ వద్ద నుంచి వివిధ ప్రాంతాల వెళ్లే వాహనాలకు గైడ్‌గా వ్యవహరించే వాడు. ఈ క్రమంలో శనివారం రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి వేములవాడకు వెళ్లే సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దాంతో మహ్మద్ యాకుబ్ అక్కడక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న స్థానిక ఎస్సై శ్రీకాంత్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.